క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీ చేయాలి

కంభం: అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో పేద దళిత పిల్లలకు సీట్ల కేటాయింపు విషయంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ఒంగోలులో మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో జిల్లాలో 396 సీట్లు మిగిలిపోయాయని, అడ్మిషన్ల గడుపు ముగిసిపోవడంతో ప్రస్తుతం విద్యార్థులను చేర్చేందుకు కూడా అవకాశం లేదని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు చదువు మానేశారని, ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా గురుకుల పాఠశాలల్లో సీట్లన్నీ భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

కొనకనమిట్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని, సమయ పాలన పాటించాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని సిద్ధవరం గ్రామ సచివాలయాన్నాయన తనిఖీ చేశారు. హౌస్‌హోల్డ్ సర్వే, స్వామిత్వ సర్వే, స్వర్ణ పంచాయతీల్లో హౌస్ టాక్స్ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎల్‌డీఓ వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

మీ కోసం గ్రీవెన్స్‌కు పది అర్జీలు



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

మార్కాపురం టౌన్: మార్కాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో కేఆర్‌సీ తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు 10 అర్జీలు అందజేశారు. భూమి ఆన్‌లైన్, కొలతలు, పాస్‌బుక్‌లు తదితర సమస్యలపై అర్జీలు అందాయని కేఆర్‌సీ తహసీల్దార్ తెలిపారు.

చెడు నడత నడవద్దు

- ఉపాధ్యాయిని రాసిన పాటను ఆవిష్కరించిన జేసీ, ఎస్పీ



పాట సీడీని ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ,

మార్కాపురం: విద్యార్థులు చదువుకునే దశలో చెడుపై దృష్టి సారించకుండా ఉండాలని మార్కాపురం బాలుర హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలాదేవి రాసిన ప్రబోధాత్మక గేయాన్ని సోమవారం ఒంగోలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఎస్పీ ఏఆర్ దామోదర్ తమ చాంబర్లలో ఆవిష్కరించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల్లో మానసిక పరివర్తన తీసుకొచ్చేందుకు తానే స్వయంగా పాట రాసి స్వరపరిచినట్లు వివరించారు. ఈ పాట రాసేందుకు ప్రోత్సహించిన హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మార్కాపురం, ఒంగోలు డీవైఈఓలు ఎం శ్రీనివాసులు, చంద్రమౌళీశ్వర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీయల్ రమేష్‌బాబు, సయ్యద్ సమీవుల్లా, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారానికి భూమి పూజ



ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దాతలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం ముఖద్వారం ఏర్పాటుకు దాతల సహకారంతో సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు గ్రామానికి చెందిన గోరంట్ల నారాయణ, వంకాయలపాటి మాలకొండయ్య సుమారు రూ.2.50 లక్షలు సొంత నిధులు ఖర్చు చేసేందుకు ముందుకొచ్చారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. భూమి పూజలో మాజీ ఉప సర్పంచ్ పాదిలి తిరుపతయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాదిలి మాలకొండ్రాయుడు, చీతిరాల వెంకటేశ్వర్లు, రామలింగయ్య, సుబ్రహ్మణ్యం, అమరా సుబ్బారావు, పాదిలి వెంకటేశ్వర్లు, వంకాయలపాటి మాలకొండయ్య, పోకా సుబ్బారావు, పోట్ల రామయ్య పాల్గొన్నారు.

ఆటోవాలా.. బతుకు డీలా!

- వాహన మిత్ర ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సుతో బాడుగలు తగ్గాయంటున్న ఆటో డ్రైవర్లు
- ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కంభం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. తాము అధికారంలోకి వస్తే వాహనమిత్ర కింద బ్యాడ్జి కలిగిన ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం 15 నెలలుగా గాలికొదిలేసింది. గత శుక్రవారం నుంచి మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించడంతో తమకు బాడుగలు తగ్గిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందించి వారికి చేయూతనందించడంతోపాటు నవరత్నాల్లో భాగంగా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పలు సంక్షేమ పథకాలు అందించడంతో ఆటోవాలాల కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉండేది. ప్రస్తుతం వాహనమిత్ర అందక, ఉచిత బస్సుతో బాడుగలు తగ్గిపోయి కుటుంబ పోషణే భారంగా మారిపోతోందని పలువురు ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. వాహనమిత్ర రూ.15 వేలు, జీవో నంబర్ 21, 31 రద్దు, డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు, డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యారుణాలు,



కంభం రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ఆటోలు

చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ. 10 లక్షలు అందించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఆటో డ్రైవర్లు

కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల్లో సుమారు 400 వరకు ఆటోలు ఉన్నాయి. అధిక భాగం ఆటోలను డ్రైవర్లు ఫైనాన్స్‌లోనే తీసుకోగా కొందరు అద్దెకు తీసుకుని తోలుకుంటున్నారు. ఆటో ధర సుమారు రూ.4 లక్షల వరకు ఉండగా నెలకు రూ.10–15 వేల వరకు కంతులు కట్టాల్సి ఉంటుంది. రిపేర్లు, ఇతర ఖర్చులకు నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు ఖర్చు వస్తోంది. వీటితోపాటు అప్పుడప్పుడు అధికారులు జరిమానా విధిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదాయం సరికపోకపోవడంతో ఆటో డ్రైవర్లు వడ్డీకి నగదు అప్పు తీసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఉచిత బస్సుతో తగ్గిన బాడుగలు

ఆటోల్లో ప్రయాణించే వారిలో మహిళలే అధికంగా ఉంటారని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. కంభం నుంచి బేస్తవారిపేట, అర్ధవీడు, తర్లుపాడు మార్గాల్లో ఆటోలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ మార్గంలో ఉండేవన్నీ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులే కావడంతో ఆటోల్లో ఎక్కే వారి సంఖ్య తగ్గిపోయిందని చెబుతున్నారు. ఆటో డ్రైవర్లతో పాటు ఆటో మెకానిక్‌లు, స్పేర్ పార్ట్స్ విక్రయదారులు, సీటు వర్కర్ల ఉపాధిపైనా ఉచిత బస్సు తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆయా రంగాలకు చెందిన వారు ఆందోళన చెందుతున్నారు.

ఏ మార్గంలో ఎన్ని ఆటోలు..?

మార్గం	ఆటోలు
కంభం- బేస్తవారిపేట రూటు	130
రైల్వే స్టేషన్-బస్టాండ్ రూటు	60
కందులాపురం స్టాండ్	60
కంభం-అర్ధవీడు రూటు	50
కంభం-గిద్దలూరు, మార్కాపురం రూటు	15 (అప్పే ఆటోలు)
రైల్వే స్టేషన్-బస్టాండ్ రూటు	60

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ. 25 వేలు అందజేయాలి. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలి. పెట్రోలు, డీజిల్ ధర తగ్గించడంతో పాటు ఉపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలి.
– మహమ్మద్ ఇబ్రహీం, ఏఐటీయూసీ నాయకుడు

కుటుంబ పోషణ భారంగా మారింది



పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలు, ఆటోల రిపేర్లతో ఆదాయం తగ్గిపోతోంది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోల్లో ఎక్కే మహిళలు తగ్గిపోయారు. పిల్లలను చదివించుకోవాలన్నా, కుటుంబాన్ని పోషించుకోవాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. వాహన మిత్ర పథకం అమలు చేస్తే ఆటో డ్రైవర్లకు కొంతైనా ఉపయోగకరంగా ఉంటుంది.
– పిల్లి శ్రీనివాసులు, ఆటో డ్రైవర్

హామీలు అమలు చేసి ఆదుకోవాలి



ఆటో డ్రైవర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందేది. అయితే రూ.15 వేలు ఆర్థికసాయం ఇస్తామన్న కూటమి నాయకులు అధికారం చేపట్టి 15 నెలలవుతున్నా ఆ ఊసే ఎత్తకపోవడం శోచనీయం. ఉచిత బస్సుతో మనుగడ ప్రశ్నార్థకంగా మారిన ఆటో డ్రైవర్ల జీవనోపాధికి ప్రభుత్వం చేయూతనందించాలి.
– గొంగటి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కంభం

హత్య కేసు కొట్టివేత

మార్కాపురం టౌన్: హత్య కేసులో నేరం రుజువు కానందున కేసును కొట్టివేస్తూ ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి తీర్పు వెల్లడించారని న్యాయవాది ఎం.అన్వర్‌బేగ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. 2016 ఆగస్టు 2న దొనకొండ మండలం మల్లంపేటలో నేతుల బాలకోటమ్మ తన కుమారుడైన గోపికృష్ణకు డబ్బు ఇచ్చి ఫోన్ రీచార్జ్ కార్డు తీసుకుని రావాలని దుకాణానికి పంపింది. అయితే గోపీకృష్ణ తిరిగి ఇంటికి రాకపోవడంతో రాత్రంతా వెతికినా ఆచూకీ దొరకలేదు. 2016 ఆగస్టు 7న ఉదయం 11 గంటల సమయంలో మృతుడి తండ్రి పెద్ద పోలయ్య, బంధువుల సాయంతో పొలాల మధ్య ఉన్న దారిలో గోపికృష్ణ మృతదేహాన్ని గుర్తించారు. దొనకొండ పోలీసులు గోపీకృష్ణ మృతిని అనుమానాస్పదంగా పరిగణించి కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వడ్లమూడి చిన్న వెంకటేశ్వర్లుపై అనుమానం ఉందని పెద్దపోలయ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో 23 మందిని సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కానందున కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి శుభవాణి తీర్పుచెప్పారని న్యాయవాది వివరించారు.

హామీలు అమలు చేయకుండా సంబరాలా?

మార్కాపురం టౌన్: అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా సూపర్ 6 హామీలు పూర్తిగా అమలు చేయకుండా అన్నీ చేసినట్లుగా కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సూపర్–6 హామీలను కూటమి సర్కారు విస్మరించినా ప్రజలు మాత్రం గుర్తుపెట్టుకుంటారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలు అమలు చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

- విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచన

మార్కాపురం: తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు విద్యార్థులు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. సోమవారం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి చదవడం ద్వారా విజయాలు సాధించవచ్చన్నారు. కళాశాలలో విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దని చెప్పారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కళాశాల అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు హెచ్ఓడీలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బేస్తవారిపేట మండలంలోని నాలుగు పీహెచ్‌సీల హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించారు. వైద్యశాలల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశాలలకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు, వైద్యశాలలో మౌలిక వసతులు, సామగ్రి కొనుగోలు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ జిలానీబాషా, ఎంపీటీసీలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు వికాస్, అక్తర్ రసూల్, కావ్య, లక్ష్మీజితేంద్ర పాల్గొన్నారు.

అరకొర బస్సులతో ఆడపడుచులకు కష్టాలు



బస్ రద్దీగా ఉంది తర్వాత రండి అని చెబుతున్న కండక్టర్

కొనకనమిట్ల: ఉచిత బస్సు పేరుతో గొప్పగా డప్పు కొడుతున్న కూటమి సర్కారుకు మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు. బస్సుల్లో సీట్లే లేకుండా ఉచితమని చెబితే ఎవరికి ఉపయోగమని మహిళలు రుసరుసలాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట వెళ్లేందుకు సోమవారం ఉదయం 8 గంటలకు కొనకనమిట్ల మండలం గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌కు సుమారు 25 మంది ప్రయాణికులు చేరుకున్నారు. అదే సమయంలో ఒంగోలు నుంచి గిద్దలూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్ వచ్చింది. బస్ ఆపగానే కొంతమంది డోర్ వద్ద నెట్టుకుంటూ ఎక్కారు. ×ఈ బస్‌లో ఖాళీ లేదు. తర్వాత బస్‌లో రండి౯ అంటూ బస్ కండక్టర్ ముక్తాయించడంతో సుమారు 20 మంది మహిళలు బస్టాండ్‌లోనే ఉండిపోయారు. మహిళలకు ప్రత్యేక బస్సులు నడపకుండా, సీట్లు లేకుండా ఉచితం పేరుతో ఎన్ని మాటలు చెబితే ఏం లాభమని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.



బస్ వెళ్లాక అయోమయంలో మహిళలు

మల్లె సాగుపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్వేత

కంభం: మల్లె తోటల్లో మొగ్గ తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉందని దర్శి హార్టికల్చర్ రీసోర్స్ స్టేషన్ శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని రావిపాడు గ్రామంలో సాగు చేస్తున్న మల్లె, జాజి పూలతోటలను సోమవారం ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పురుగుల లార్వా పువ్వు మొగ్గలోకి చొచ్చుకెళ్లడం వల్ల గులాబీ రంగులోకి మారిన తర్వాత ఎండిపోతుందన్నారు. నల్లి ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పారు. రసం పీల్చే పురుగుల తాకిడి నివారణకు రైతులు మాస్ ట్రాపింగ్ పద్ధతిలో జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని చెప్పారు. అనంతరం పూలతోటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖాధికారిణి డి.శ్వేత, వీఏఏ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మండలంలోని వేములకోట, నికరంపల్లి గ్రామాల్లో ఏఓ బుజ్జీబాయి సోమవారం పర్యటించారు. వర్షాల నేపథ్యంలో కంది, పత్తి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్నదాత సుఖీభవకు అర్హత ఉండి డబ్బు పడనివారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని, బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ యాక్టివేట్ చేయించుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్ నగదు జమకాని వారు వీఏఏ లాగిన్‌లో ఈకెవైసీ చేయించుకోవాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జైలు

గిద్దలూరు రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు జడ్జి కె.భరత్ చంద్ర జైలు శిక్ష విధించినట్లు సీఐ కె.సురేష్ సోమవారం తెలిపారు. పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్ వద్ద మద్యం మత్తులో పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా వారిలో ఇద్దరికి రూ.10 వేలు జరిమానాతోపాటుగా 5 రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తికి రూ.10 వేల జరిమానాతోపాటు 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ వివరించారు.

నడిరోడ్డుపై మొరాయించిన లారీ

- వేములకోట వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్



వేములకోట వద్ద భారీగా నిలిచిన వాహనాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామ సమీపంలో నడిరోడ్డుపై సోమవారం ట్రాఫిక్ నిలిచిపోయింది. లారీ రివర్స్ చేసుకునే క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఆగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లారీకి ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. లారీని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మార్కాపురంలో 5 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం: పట్టణంలో 5 బార్ అండ్ రెస్టారెంట్లకు లైసెన్సులు జారీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మార్కాపురం ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో బెల్లం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు నూతన బార్లకు లైసెన్సులు ఇస్తామన్నారు. మూడు విధాలుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు 5 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఇది నాన్ రీఫండబుల్ ఫీజు అని స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ ఫీజు కింద అదనంగా పది వేల రూపాయలు చెల్లించాలని, లైసెన్సు ఫీజు ఏడాదికి 55 లక్షల రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 28న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్సులు మంజూరు చేస్తారన్నారు. ప్రతి బార్‌కు 4 అప్లికేషన్లు తప్పనిసరిగా రావాలని, లేదంటే లాటరీ నిలిపేస్తారని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా ఆఫీసర్ డి.మధుసూదన్

- జిల్లా మలేరియా ఆఫీసర్ డి.మధుసూదన్

రాచర్ల: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా ఆఫీసర్ డి.మధుసూదన్ అన్నారు. మండలంలోని రాచర్లఫారం గ్రామ సమీపంలోని గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొఠారి కరుణ అనే విద్యార్థిని తీవ్రమైన జ్వరం రావడంతో కంభం వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా పత్రికల్లో వచ్చిన కథనానికి జిల్లా మలేరియా ఆఫీసర్ డి.మధుసూదన్‌తో పాటు డీసీవో డి.జయ సోమవారం పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మలేరియా ఆఫీసర్ డి.మధుసూదన్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఎలాంటి జ్వరం వచ్చినా వెంటనే వాటికి సంబంధించిన మందులు ఇవ్వాలన్నారు. రెండు రోజుల పాటు జ్వరం తగ్గకుంటే తక్షణమే అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లను సంప్రదించి పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పాఠశాలలో ముగ్గురికి జ్వరం ఉందని వారికి పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డీసీవో డి.జయ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంటేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో చల్లటి ఆహారం ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు, సైడుకాలువలు, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, సైడుకాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు షేక్.మొయినుద్దీన్, వారణాసి గిరిధర్ శర్మ, అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్యక కేంద్రం డాక్టర్లు కే.భానుకుమార్ రెడ్డి, కే.రమేష్, గిద్దలూరు, కంభం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు వెంటేశ్వర్లు, ఎమ్.వెంకటేశ్వర్లు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మేరీమంజుల తదితరులు పాల్గొన్నారు.